పనుల ఎంపికను నిర్లక్ష్యం చేయొద్దు

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్‌డీవో

- **డీఆర్‌డీవో చిన్ని ఓబులేషు**

తిమ్మాజిపేట, అక్టోబర్ 16 : ఈజీఎస్ గ్రామసభలు పూర్తయ్యి 15రోజులు గడుస్తున్నా పనుల ఎంపిక, రైతుల అంగీకార పత్రాలు సేకరించకపోవడంపై డీఆర్‌డీవో చిన్ని ఓబులేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఫార్మేషన్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఎన్ని పనులను ఎంపిక చేశారు, ఇందుకు సంబంధించి రైతుల వివరాలు, అంగీకార పత్రాలెన్ని తీసుకున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాచారం రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈజీఎస్ నుంచి గ్రామాల్లో చేపట్టాల్సిన 266 పనులకు సంబంధించిన జాబితా ఉందని, వాటిలో చేపట్టాల్సిన పనులు ఎంపిక చేయకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో ఇద్దరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, క్షేత్రసహాయకుడు శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న సర్కార్

విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు దారమోని గణేశ్

కల్వకుర్తి, అక్టోబర్ 16 : విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే దిశలో రేవంత్‌రెడ్డి సర్కార్ పయనిస్తుందని బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు దారమోని గణేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించకుండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాల్లో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో చాలా ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని వాపోయారు. సమీకృత గురుకుల పేరుతో గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం పన్నాగం పన్నిందని, మన ఊరు- మన బడి పథకాన్ని మరుగన పడేసిందన్నారు. ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న విద్యాసంస్థలకు అద్దెలు చెల్లించకపోవడంతో అద్దె భవనాలకు తాళాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్ గౌడ్, కృష్ణ, పరుశురాములు, రమేశ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు శేఖర్

కొల్లాపూర్, అక్టోబర్ 16 : ఇంటర్ నుంచి పీజీ వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ నాయకుడు శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పేదవిద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదన్నారు. వెంటనే విడుదల చేయాలని, లేనియెడల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి నాయకులు భాస్కర్, వినోద్, చరణ్, అజయ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

కంకరవేసి రోడ్డు మరిచారు

రోడ్డుపై కంకర పరిచి వదిలేసిన దృశ్యం

బిజినేపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని వట్టెం నుంచి వెల్గొండ వెళ్లే దారికి కంకర పరిచి ఏడాది కావస్తున్నా బీటీ రోడ్డు వేయడం మరిచారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఈ రోడ్డును బీటీగా వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. రూ.కోటికిపైగా వ్యయంతో సుమారు 4కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డును వేసేందుకు ఈనిధులు వచ్చాయి. గతంలో మట్టి రోడ్డు ఉండగా రైతులు, వెల్గొండ, వట్టెం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అప్పట్లో కంకరవేసిన వారు నేటికి బీటీ వేయకపోవడంతో గ్రామస్తులు నరక యాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డును బీటీగా మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దంపతుల హత్యతో ముష్టిపల్లిలో విషాదం

ముష్టిపల్లిలో మృతుల ఇల్లు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 16 : రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కొత్తగూడ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో భార్యాభర్తల హత్యతో మండలం ముష్టిపల్లి గ్రామంలో విషాదం అలుముకోంది. మండలంలోని ముష్టిపల్లికి చెందిన చిన్నఊశన్న(65), భార్య శాంతమ్మ(60) ఇదే గ్రామానికి చెందిన మనోహర్‌రావు అనే వ్యక్తికి చెందిన ఫామ్‌హౌజ్‌లోని మామిడి తోటకు కాపలాగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి హత్యకు గురికావడంతో ముష్టిపల్లిలో విషాదం నెలకొన్నది. మృతులకు కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★B.Sc. Computer Freshers 2022, 2023, 2024 Batch Male Candidates కావలెను. జీతము 17,200+ అలవెన్సులు కలవు. కాంటాక్ట్ నెం: 9848169290.

NT-336728

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ప్రణాళికతో సిద్ధం కావాలి

- 22న ఎంప్లాయిమెంట్ అవగాహన సదస్సు
- కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించబోయే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌పై అవగాహన సదస్సుకు సరైన ప్రణాళికలతో సిద్ధంకావాలని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఈనెల22వ తేదీన నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా సరైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలపై నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన సదస్సుకు ఏర్పాట్లు, తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు నిరుద్యోగ యువతకు, పథకాలపై పూర్తిగా అవగాహన కల్పించేలా అధికారులు సమాయత్తం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవోస్ ప్రతినిధి వెంకట్, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చీఫ్‌మేనేజర్లు చాగంటి, సురేశ్, అశ్వినికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

కొల్లాపూర్, అక్టోబర్ 16 : మండలంలోని నరసింహాపురం, చౌటబెట్ల గ్రామాల్లోని వరి పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ పరిశీలించారు. వరిలో సుడిదోమ ఉధృతి అధికంగా ఉందన్నారు. దీని నివారణకు ఫెక్సాలన్ 94 మిల్లిలీటర్లు ఎకరానికి స్ప్రే చేయాలన్నారు. రైతులు సస్యరక్షణ సలహాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

ముసురుతో ఆందోళనలో రైతులు

బల్మూరు, అక్టోబర్16 : మూడురోజులుగా ముసురు వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మధ్యాహ్నం వర్షం రావడంతో ఇటీవల రైతులు వేసిన వేరుశనగ పంటలు పూర్తిగా నాశనమవోతుందని వాపోతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుభరోసాను అందించాలి

వంగూరు, అక్టోబర్ 16 : రైతులు యాసంగి పంటల సాగుకోసం అప్పులు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు శివరాములు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి విడుత రైతు భరోసాకు మంగళం పాడిందన్నారు. ప్రభుత్వం రెండోవిడుత రైతుభరోసా నైనా విడుదల చేయకపోతే రైతులు అప్పుల ఊబిలోకి చేరడం ఖాయమన్నారు. రైతులు రోడ్డెక్కక ముందే వారి ఖాతాలో రైతు భరోసాను వేసి వారిని ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

రేపు సింబాలిక్ టార్చ్ రిలే ప్రోగ్రాం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీన టార్చ్ రిలే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి సీతారాం బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ వరకు టార్చ్‌రిలే కార్యక్రమం ఉంటుందన్నారు. 14సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు,క్రీడా సంఘాలు, జిల్లాకు చెందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, సీనియర్ ప్లేయర్స్, అకాడమీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

27న మాలల ఆత్మగౌరవ సభ

తాడూరు, అక్టోబరు 16 : ఈనెల 27న మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లానాయకులు చంద్రయ్య, చంటి, శేఖర్, సూర్యనారాయణ, కుర్మయ్య, బాల స్వామి, భీమన్న, బాలరాజు కోరారు. మాలల ఆత్మగౌవర సభకు మండలంలోని మేడి పుల్‌నుంచి జన సమీకరణ బుధవారం సమావేశం నిర్వహించారు.

రైతులకు ఇబ్బందులు రానీయం

- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తాడూరు, అక్టోబర్ 16 : దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. తాడూరు మండలంలోని చర్లఇటిక్యాలలో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యం చెందకుండా వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని సూచించారు. సన్న వడ్లకు రూ.500ల బోనస్ ప్రకటించిన విధంగానే ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో ఆక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటాం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : ముదిరాజ్‌లకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్‌లో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ముదిరాజ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు



నిజాంబాద్‌లో కలుపుతో కూడిన వేరుశనగ పంట

వంగూరు, అక్టోబర్ 16 : మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వేరుశనగ పంటను ముందుగానే సాగు చేశారు. సాగు చేసింది మొదలు వర్షాలు కురుస్తుండటంతో పంటలో కలుపు తీవ్రత పెరిగింది. దీనికి తోడు వివిధ రకాల తెగుళ్లు సోకే అవకాశం వుండటంతో వాటి నివారణ కోసం వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు,సలహాలు అందిస్తున్నారు.

కలుపు నివారణ..

వేరుశనగ పంట సాగు చేసిన 20 రోజుల తర్వాత ఇమాజిట్‌పైర్ 250ఎంఎల్ నుంచి 300 ఎంఎల్ వరకు నీటితో కలిపి ఎకరాకు పిచికారీ చేసినట్లైతే కలుపు నివారించవచ్చు. లేనిపక్షంలో క్విజోల్‌ఫా ఫ్యిజిల్ 300 నుంచి 350 ఎం ఎల్ ఎకరాకు నీటితో కలిపి నేత తడిగా వున్నప్పుడు పిచికారీ చేస్తే కలుపు నివారించవచ్చు.

రసంపీల్చే పురుగు నివారణ కోసం..

వేరుశగ పంటలో రసం పీల్చే పురుగు గమనించినట్లైతే వాటి నివారణ కోసం మోనోక్రోటోఫాస్ ఎకరాకు 200 ఎంఎల్ నీటితో కలిపి నివారించవచ్చు. లేదా ఎ సీఫేట్ 250 గ్రాముల చొప్పున ఎకరాకు నీటితో కలిపి పిచికారీ చేసి పంటను కాపాడుకోవచ్చు.

లద్దె పురుగు..

వేరుశగ పంటలో లద్దె పురుగు గమనించినట్లయితే నివారణ కోసం రైతులు ఎమామెక్టిన్ బెంజోట్ 100 గ్రాముల చొప్పున నీటితో కలిపి ఎకరాకు పిచికారీ చేసి పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

బాధ్యతతో చర్యలు తీసుకోవాలి

వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడూరు, అక్టోబరు 16 : దళితులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు తాసీల్దార్ కిరణ్మయికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడుతూ దసరా పండుగ రోజు జమ్మి ఊరేగింపు సందర్భంగా డీజే వద్ద డ్యాన్స్ చేస్తుండగా దళితుడు శ్రీశైలానికి ఫిట్స్ వచ్చిందన్నారు. అతడిని దవాఖానకు తీసుకెళ్లేందుకు రమేశ్, బాలరాజు, సురేశ్, శ్రీశైలం వాహనానికి దారి ఇవ్వాలని అడుగగా, అగ్రవర్ణాలు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశామన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్, రాజు, మాసన్న, రాములు, భీమయ్య, కృష్ణ పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయం

వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తులు

పెంట్లవెల్లి, అక్టోబర్ 16 : మానవ జాతిఆదర్శవంత మైన కట్టు బట్టుకు, సంప్రదాయలను రామాయణం ద్వారా నీతి నియమాలను అందించిన వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని వాల్మీకిసంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొండూరులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండురోజుల నుంచి జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం హోమం, సత్యనారాయణ వ్రతం, నవధాన్యాలతో వాల్మీకి విగ్రహానికి పూజలు, గ్రామంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు రాములు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ వాల్మీకి సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోపులాపూర్‌గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాముడు, బాలయ్య, శ్రీనివాసులు, ప్రవీణ్, ఆంజనేయులు, వాసుదేవుడు, సాయిబాబురెడ్డి, శ్రీనివాసులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా కొండూరు గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం 8 గంటలకు ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు.

వాటర్‌మెన్స్‌కు శిక్షణ

తాడూరు, అక్టోబరు 16 : మిషన్‌భగీరథ తాగునీటి నిర్వహణపై గ్రామపంచాయతీ వాటర్‌మెన్స్‌కు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీవో బ్రహ్మచారి శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంపీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శివకుమార్, టీవోటీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీనాథ్

వెల్దండ, అక్టోబర్ 16 : టీకాలు వేయించి రోగాల బారి నుంచి పశువులను కాపాడుకుందామని మండల పశువైద్యశాఖాధికారి శ్రీనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని బుడ్డోన్‌పల్లి, తిమ్మినోనిపల్లి, అజిలాపుల్ గ్రామాల్లో పశువైద్యశాఖ ఆధ్వర్యం లో పశువులకు గాలికుంటువ్యాధి నివారణనిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన టీకాల పంపిణీని పరిశీలించారు. ప్రతిఒక్కరూ పశువులకు టీకాలు వేయించి, పశుసంపదను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ వెంకన్న ఉన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, అక్టోబర్ 16 : తిమ్మాజిపేట మండలంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. బుధవారం మండలంలోని కోడుపర్తి, చేగుంట, ఆర్‌సీ తండాల్లో పశువైద్య అధికారులు, సిబ్బంది టీకాలను వేశారు. ఈ సందర్భంగా మొత్తం 515 పశువులకు టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రావని సిబ్బంది తిరుపతయ్య, విజయ్, లలిత, శాంతయ్య, గోపాల మిత్రలు స్వామి, జగ్జీవన్, మన్మదాచారి తదితరులు పాల్గొన్నారు.

గమ్యస్థానానికి దారేదీ..!

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 16 : గమ్యస్థానానికి దారేదని, రోడ్డు నిండా వర్షపునీరు ఉండడంతో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. అచ్చంపేట పట్టణంలోని శేఖరయ్య ఫంక్షన్‌హాల్ పక్కన నుంచి సాయినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి రెండు, మూడు రోజుల నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురవడంతో రోడ్డుపై వర్షపునీరు నిలిచిందని దీనికి తోడు పక్కనే డ్రైనేజీ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డు పరిస్థితి ఈ విధంగా ఉంటే భారీ వర్షాలు కురిస్తే ఈ మార్గం చెరువులను తలపించి రాకపోకలు నిలిచి పోతున్నాయన్నారు. దీంతో మురికి కాల్వల ద్వారా దోమలకు ఆవాసాలుగా తయారై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు, అధికారులు ప్రతియేటా ఇంటి పన్ను ఇంటింటికీ తిరిగి వసూలు చేశారు కానీ ఇలాంటివి చూసి కూడా పట్టించుకోవడంలేదని ప్రజలు ఒకరి నొకరు చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిలువవుండకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కంటి పరీక్షా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : తెలంగాణ విజయ్ సెంటర్(కంటి పరీక్షా కేంద్రం)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన కంటి పరీక్షా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. 46మందికి కంటి పరీక్షలు నిర్వహించి 12 మంది రోగులను లయన్ రాంరెడ్డి కంటి దవాఖానకు ఐవోఎల్ ఆపరేషన్ కోసం పంపించినట్లు వెల్లడించారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పక్కన గల రూమ్ నెంబర్ 102లో తెలంగాణ విజయ్ సెంటర్(తెలంగాణ కంటి పరీక్షా కేంద్రం)ను ప్రారంభించడం జరిగిందని, ప్రతి బుధ, శుక్రవారం ఉచితంగా కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి కంటి ఆపరేషన్ చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, పర్యవేక్షణాధికారులు నర్సింహా, శ్రీనివాస్, నేత్రాధికారి బాలాజీ, వెంకటేశ్, వెంకటస్వామి, రమేశ్‌రెడ్డి, ఫార్మసిస్టు కుమార్, సురేశ్, సుకుమారెడ్డి, ప్రకాశ్, కల్యాణ్, ల్యాబ్ టెక్నీషియన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, అక్టోబర్ 16 : మండల కేంద్రలోని ఈనెల 22న యూసుఫొద్దీన్ ఉర్సు 75వ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిఖిల్‌రెడ్డి, ఉర్సుకమిటీ సభ్యులు షర్ఫొద్దీన్, షబ్బీర్, ఫకృద్దీన్, ఆరీఫ్ పాల్గొన్నారు.

పంటలను కాపాడండి

వెల్దండ, అక్టోబర్ 16 : కేఎల్ఐ కాల్వ ద్వారా ఎగువ నుంచి దిగువకు నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో కాల్వలు తెగి పంట పొలాలు నీట మునుగుతున్నాయని పోతెపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పోతెపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల శివారులో తరుచూ కాల్వ తెగి పంటలు నీట మునుగుతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే డ్యామేజ్ ఉన్న వద్ద కాల్వను మరమ్మతులు చేయించి, పంటలను కాపాడాలని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండల్, శ్రీశైలం, బాలస్వామి, శివ, మల్లేశ్, ఎల్లయ్య, వీరయ్య, అమృతయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఊర్కొండ, అక్టోబర్ 16 : మండలంలోని గుండ్ల గుట పల్లి, ముచ్చర్ల పల్లి, రేవల్లి గ్రామాల్లో మంగళవారం మృతిచెందిన పలు కుటుంబాలకు రాజకీయ పార్టీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండలానికి చెందిన బీజేపీ నాయకులు జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు రూ.5.వేల చొప్పున మొత్తం రూ.15వేలు వారి అనుచరుల ద్వారా పంపించారన్నారు. అదేవిధంగా రేవల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వసంత పుర నాగమ్మ మంగళవారం మృతిచెందినారు. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెందాలు వేసుకుని రూ.8వేలు వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

కొలువుదీరిన కొత్త పంతుళ్లు

అమ్రాబాద్/ కోడేరు, అక్టోబర్ 16 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో పాఠశాలల్లో కొత్త పంతుళ్లు బుధవారం కొలువుదీరారు. ఎంఈవో కార్యాలయంలో 16 మందికి ఉత్తర్వులను ఎంఈవో బాలకిషన్ నియామక పత్రాలను అందజేశారు. పదర మండలంలో ఇన్‌చార్జి ఎంఈవో బుచ్చిబాబు 8మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం టాల్‌సింగ్, మోతీలాల్, తులసిరాం, సేవ్యా పాల్గొన్నారు. కాగా కోడేరులో ఎంఈవో భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను తీసుకొని విధుల్లో చేరారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 : ఇటీవల ఉపాధ్యాయులుగా నియామకమైన మండలానికి చెందిన 19 మందికి మండలకేంద్రంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య, మండల అధ్యక్షుడు బాబురావులు సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాలధాన స్వాములకు వసతులు కల్పిస్తాం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ఆలయ చైర్మన్, అర్చకుడు, గురుస్వాములు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 16 : మద్దిమడుగు ఆంజనేయ స్వామి